క్లుప్తంగా

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల, ఇబ్రహీంనగర్, గోనెపల్లి గ్రామాల్లో వరి పొలాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నాట్లు వేసిన 15 నుంచి 20 రోజుల మధ్యలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కేజీలు వేయాలన్నారు. ప్రధానంగా పిలకలు వేసే దశలో మొగి పురుగు, ఆకు ముడుత పురుగు గమనించినప్పుడు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి సాగులో చీడపీడలు, నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి



పోస్టాఫీసు డిపాజిట్ల కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

హుస్నాబాద్‌రూరల్: భారత పోస్టాఫీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పీఎం సత్యం అన్నారు. శుక్రవారం పోస్టాఫీసు అవరణలో ప్రజలకు పోస్టాఫీసు డిపాజిట్లపై అవగాహన కల్పించారు. చిన్నమొత్తాల పొదుపుతో పాటు డిపాజిట్లను సైతం స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు తపాలాశాఖ వడ్డీ రేట్లను పరిశీలించి పోస్టాఫీసులో నగదు డిపాజిట్ చేసి లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టు మాస్టర్ విద్యాసాగర్, శ్రీనివాస్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

డీబీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి

సిద్దిపేటరూరల్: మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులందరికీ తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. శుక్రవారం రైల్వేలైన్ భూ నిర్వాసితులు డీబీఎఫ్ ఆధ్వర్యంలో తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన 22 మంది దళిత భూ నిర్వాసితులు కొండపాక మండలం తిమ్మారెడ్డి పల్లి గ్రామంలో సర్వే నెం 133లో ప్లాట్లు కొనుగోలు చేశారు. రైల్వేలైన్ నిర్మాణంలో మరోసారి వారి భూములు పోతుండటంతో నిర్వాసితులుగా మారారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి నిర్వాసితులకు న్యాయం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో గజ్వేల్ మున్సిపాలిటీ ఆదర్శం

గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యంతో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పాలకవర్గ సభ్యులకు కమిషనర్ విద్యాధర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సామూహిక సూర్యనమస్కారాల సాధన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రథసప్తమిని పురస్కరించుకొని వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కోమటి చెరువు కట్టపై ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సామూహిక సూర్యనమస్కారాల సాధన ఉంటుందని సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, యోగా శిక్షకుడు తోట సతీశ్ శుక్రవారం తెలిపారు. సూర్య భగవానుడిని స్మరిస్తూ సూర్య నమస్కారాలు చేయడం మనసుకి, శరీరానికి చాలా మంచిదన్నారు.

భయం పోగొట్టేందుకే 'పరీక్షా పే చర్చ'



పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేర్యాల(సిద్దిపేట): పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని తొలగించేందుకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో చేపట్టిన 'పరీక్షాపే చర్చ' కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని తాడూరు పాఠశాలతో పాటు పట్టణ పరిధిలోని వికాస్ గ్రామర్ స్కూల్‌లో బీజేపీ నాయకులు నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని విద్యార్థులు లైవ్‌లో వీక్షించారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని, ఎప్పుడు పరీక్షలు వచ్చినా రాసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇష్టపడి చదివి పరీక్షలు రాయాలని, ఎంచుకున్న రంగాలలో రాణించి, దేశానికి కాబోయే మార్గదర్శకులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్, జనగామ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు పాండు, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకొని నవభారత నిర్మాణం కోసం కృషి చేయాలని మాజీ రాష్ట్ర హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాం అన్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్రమోడీ పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. మహనీయుల చరిత్ర చదివితే వారి అడుగుజాడల్లో నడిచేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, జనగామ వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: ప్రపంచానికే సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పిన భారత దేశం విద్యా విధానంలో సైతం గొప్ప స్థాయిలో ఉందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలోని సరస్వతీ గ్లోబల్ స్కూల్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 10, 11, 12 తరగతుల విద్యార్థుల కోసం నిర్వహించిన పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకే ప్రధాన మంత్రి పరీక్షాపే చర్చ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని వేలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రధాని మోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చ లైవ్ కార్యక్రమాన్ని వీక్షించారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం కనకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



వడ్డెర సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి మదిర వడ్డెర కాలనీలో వడ్డెర సంఘం కమ్యూనిటీ భవనానికి ఎంపీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలు, మతాల ప్రజలు సంతోషంగా జీవించాలన్నదే కేసీఆర్ ఉద్దేశమన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఎంపీ నిధులు మంజూరు చేస్తామన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ ప్రజలకు అందించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ పార్టీని సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ సుమలత, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కంటి వెలుగు

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి



కుకునూరుపల్లి కంటి వెలుగు శిబిరంలో కంటి అద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): అంధత్వ రహిత తెలంగాణ దిశగా ప్రభుత్వం ముందుకు పోతోందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న వారిని పరీక్షలు ఎలా చేస్తున్నారనంటూ అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంటి ఆపరేషన్లు చేయించి అద్దాలను అందజేస్తున్నారన్న విషయాన్ని వివరిస్తూ కంటి అద్దాలను అందజేశారు. కంటి వెలుగు పథకం లక్ష్యం నీరుగారకుండా చూసుకుందామన్నారు. అంతకు ముందు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకునే వారు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి మమతతో గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కంటి చూపు ఆవశ్యకత వివరిస్తూ శిబిరానికి పంపించారు. ఈకార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు నరేందర్, ఎంపీఓ వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగులో ప్రతీ ఒకరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మధ్యాహ్నం డీఎల్‌పీఓ వేదావతి కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, ఏపీఎం ఆనంద్, సర్పంచ్ మమత, ఉపసర్పంచ్ అనసూయ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 2 వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ విద్యార్థులు శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు.

నంగునూరు(సిద్దిపేట): కంటి సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరిని పరీక్షించి అద్దాలు అందజేయాలని కంటి వెలుగు జిల్లా మానిటరింగ్ అధికారి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సరోజ అధికారులకు సూచించారు. మైసంపల్లి, నాగరాజుపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతం చేయాలన్నారు. శస్త్రచికిత్స అవసరం ఉన్నవారిని గుర్తించి సిఫార్సు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి



బీమా నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్‌లో కార్మికుల సంక్షేమం కోసం బల్దియా చర్యలు చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే అన్ని విభాగాల కార్మికులు 468 మందికి పోస్టల్ శాఖ రూ.399 బీమా పథకాన్ని అమలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు కార్మికులకు బీమా సౌకర్యం కల్పించామన్నారు. ప్రమాదవశాత్తు బీమా పొందిన కార్మికుడు మృతి చెందితే రూ.10 లక్షలు కుటుంబానికి వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో హరితహారం ప్రత్యేక అధికారి ఐల్లయ్య, మున్సిపల్ అధికారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం చిన్న గ్రామ పంచాయతీలు



బెజ్జంకి క్రాసింగ్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజల సౌకర్యార్థం చిన్న గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని తిమ్మాయపల్లె, బెజ్జంకి క్రాసింగ్‌లలో నూతన గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాలలో మౌలిక వసతుల కల్పనతోపాటు అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎంపీడీఓ రాము, మండల కోఆప్షన్ సభ్యుడు మహిపాల్ రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ధర్నా



దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్ వాడీలు

దుబ్బాకటౌన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు శుక్రవారం దుబ్బాకలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూజిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్ వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. టీచర్లతో సమానంగా వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. 2017 నుంచి ఉన్న టీఏ, డీఏ బకాయి చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో అంగన్ వాడీలకు న్యాయం జరిగే విధంగా కేటాయింపులు ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, విజయ, సురేఖ, బాలమణి, లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, స్వరూప, యాదమ్మ, మమత, కనకతార, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



జ్ఞాపికతో సన్మానిస్తున్న దృశ్యం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సీహెచ్ మధుసూదన్‌కు డిసెంబర్ 22 తేదీన ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును ప్రదానం చేసిన సందర్భంగా శుక్రవారం కళాశాలలో సన్మానించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బోధన, పరిశోధన, సేవా రంగాల్లో మధుసూదన్‌కు అవార్డు లభించడం సంతోషకరమన్నారు. అభినందించినవారిలో వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ అధ్యాపకులు, లెక్చరర్ సంఘ బాధ్యులు ఉన్నారు.

ముంపు బాధితులకు భరోసా



కాలనీ వాసులతో మాట్లాడుతున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): శనిగరం డామ్స్ నీటితో మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ జలమయం అవుతోందని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని మంత్రి హరీశ్‌రావుకు కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, మంత్రి ఓఎస్‌డీ బాల్‌రాజు ఎస్సీ కాలనీని సందర్శించారు. శనిగరం డ్యామ్ నీటితో కాలనీ జలమయమై ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామన్నారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఇంటి స్థలాలు ఇప్పించి, ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొండం వనిత రవీందర్ రెడ్డి, సర్పంచ్ స్వర్ణలత శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు స్థలం కేటాయించాలి



గజ్వేల్‌లో ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గజ్వేల్‌రూరల్: భవన నిర్మాణ కార్మిక భవనానికి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో స్థలం కేటాయించాలని భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో ఆర్డీఓ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమ సమస్యలు చర్చించుకునేందుకు సమావేశ భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకు స్థలం కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్డీఓను కోరామన్నారు. కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు కప్ప చంద్రం, ఉపాధ్యక్షుడు మన్నె నర్సింలు, ఆదర్శ మిల్లర్ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు బగారి యాదగిరి, సభ్యులు పొన్నాల కుమార్, స్వామి, కనకయ్య, ఐలయ్య, కిషన్, సంతు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటఅర్బన్: సిద్దిపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దొంతుల వీరేశం కుమార్తె వైష్ణవి కి హైదరాబాద్‌కు చెందిన సాయిరాంకు సిద్దిపేటలో శుక్రవారం వివాహం జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా, రుక్మిణి దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సంక్షిప్త వార్తలు

◆ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా అఖిల్ గౌడ్



తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్‌గా మండల కేంద్రానికి చెందిన సిలివేరి అఖిల్ గౌడ్ నియమితులయ్యారు. సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ నవీన్ నెట్టం శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి, రాష్ట్ర కన్వీనర్ నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ నేడు మండలానికి కేంద్ర బృందం రాక

తొగుట(దుబ్బాక): మండలంలో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులను జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం పరిశీలిస్తుందని ఎంపీడీవో శ్రీధర్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కాన్గల్, మధ్యాహ్నం 2 గంటలకు తుక్కాపూర్‌లో పనులు పరిశీలిస్తారని పేర్కొన్నారు.

◆ డీఎల్‌పీఓకు ఫిర్యాదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప గ్రామంలో ప్రతీ మంగళవారం జరుగుతున్న కూరగాయల మార్కెట్‌కు వ్యాపారుల నుంచి తైబజారు వసూల్ చేస్తున్నారని గ్రామ మాజీ సర్పంచ్ రవి, బీజేపీ నాయకుడు శ్రీధర్ మంగళవారం డీఎల్‌పీఓ వేదావతికి ఫిర్యాదు చేశారు. పూర్తి సమాచారం తెలుసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

◆ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సత్తాగౌడ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య శుక్రవారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐతం శ్రీనివాస్, బ్యాగరి నర్సింహులు తదితరులు ఉన్నారు.

◆ అమ్మవారి పల్లకీ సేవ



అమ్మవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ దేవాలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షరాభ్యాసం, కుంకుమార్చన, ఒడిబియ్యం, బలిహరణం, పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారికి పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీగా హాజరయ్యారు.

◆ మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి, ఖాజీపూర్‌లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మేడిపల్లి సాయికృష్ణ, కమ్మరి యాదగిరి, శ్యామల మల్లవ్వ, కర్రోల్ల శ్యామల కుటుంబాలను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు శుక్రవారం పరామర్శించారు. అలాగే భూంపల్లిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ సునీల్‌ను పరామర్శించారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్ పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి, భవానీల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా నాయకులు మల్లన్నగారి భిక్షపతి, సంతోశ్, పార్టీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, సాయిలు తదితరులు ఉన్నారు.

◆ రాష్ట్ర ప్రభుత్వానికి స్పౌజ్ ఫోరం కృతజ్ఞతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దంపతులను ఒకే జిల్లాకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై సిద్దిపేట స్పౌజ్ ఫోరం సభ్యులు కృష్ణ, బాలస్వామి, మహేశ్ సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. 171 మందికి గాను 46 మందిని జిల్లాకు కేటాయించిందని, మిగతా వారిని త్వరగా కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలన్నారు.

◆ వైభవంగా మహంకాళమ్మ ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: పట్టణంలో మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు కుంకుమార్చన చేశారు. ఎమ్మెల్యే రఘునందన్ రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద కార్యక్రమంలో స్వయంగా భక్తులకు అన్నం వడ్డించారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మానించారు.

◆ వరి పొలాల పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారులో సాగుచేస్తున్న వరి పొలాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి సంతోష్ సందర్శించారు. వరి చేలోని ఆకులు ఎర్ర పడుతుడటం గమనించారు. లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మొగి పురుగు నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట ఏఈఓ రేణుక, రైతులు పాల్గొన్నారు.

◆ జాతీయ క్రీడాకారుడికి సన్మానం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామానికి చెందిన రాహుల్ గౌడ్ జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొనగా కలెక్టర్ కార్యాలయంలో ప్రతిభా పురస్కారం అందుకున్నాడు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభను కనబర్చినందుకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని చేతుల మీదుగా అందించినట్లు ఉప సర్పంచ్ గిరిగౌడ్ తెలిపారు.

◆ అభయజ్యోతిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

సిద్దిపేటజోన్: అభయజ్యోతి పాఠశాలలో శుక్రవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు అభయ జ్యోతి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శివ, హరి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

◆ ముగిసిన మల్లన్న జాతర

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ గ్రామంలో భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లన్న జాతరలో భాగంగా చివరిరోజు రథాన్ని ఊరేగించారు. వేడుకల్లో భస్వాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో ఆలయ అర్చకుడు భస్వప్ప, కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

◆ జాతీయ జెండాను గౌరవించడం తెలియదు

అక్కన్నపేట(హుస్నాబాద్): గణతంత్ర దినోత్సవం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మండలంలోని గౌరవెల్లిలోని ఓ హోటల్ వద్ద జాతీయ జెండాను గురవారం ఎగురవేశారు. అయితే సాయంత్రి జెండాని తీసి భద్రపరచావల్సి ఉన్నా నాయకులు శుక్రవారం మధ్యాహ్నం వరకు తీయకపోవడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జాతీయ జెండాను ఎగరవేయడం తప్ప గౌరవించడం తెలియదని కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మంద పర్శరాములు విమర్శించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

◆ చైన్ స్నాచర్ అరెస్ట్

సిద్దిపేటకమాన్: మహిళ మెడలోని బంగారు గొలుసు దొంగిలించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సిద్దిపేట పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం గణేశ్ నగర్‌కు చెందిన సౌందర్య మూడు రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు వచ్చిన బైక్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టగా మిరుదొడ్డి మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన డిగ్రీ చదువుతున్న భాస్కర్‌గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.